
కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

సమతాపురికాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సమతాపురికాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన సమతాపురికాలనీలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న పారిశుధ్య, పాడైన డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల తదితర సమస్యలను ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో పాడైన, పాత మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని జలమండలి అధికారులను ఆదేశించారు. కాలనీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పారిశుధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు

శ్రీరామ అయోధ్యనగర్‌కాలనీ నూతన కార్యవర్గం

చంపాపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరామ అయోధ్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా డి.ప్రభాకర్‌రెడ్డి, ప్ర ధాన కార్యదర్శిగా ఏ.వెంకటాచారి, కోశాధికారిగా పి.సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గా జి.వెంకట్‌రెడ్డి, కె.నవీన్‌గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా వై.ప్రశాంత్‌రెడ్డి, పి.యాదవరెడ్డి, సలహాదారులుగా కె.శ్రీధర్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎల్.దశరథ్‌రెడ్డి, కన్వీనర్‌గా నర్సింహముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా యు.రాము, కె.కార్తీక్‌రెడ్డి, పి.సురేష్ ముదిరాజ్, కె.రవీందర్‌రెడ్డి, ఎం.నర్సింహాచారి, కార్యవర్గ సభ్యులుగా వి.జంగయ్య, డి.సంతోష్‌రెడ్డి, ఈ.కరుణాకర్‌రెడ్డి, కె.జంగయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణస్వీకారం చేశారు. కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్, చామకూర రాజు తదితరులు

వంటగ్యాస్ సరఫరా కార్మికులను ఆదుకోండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు కోరారు. ఎల్బీనగర్‌లోని మహాత్మాజ్యోతి రావుపూలే విగ్రహం వద్ద ఈనెల 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే యూనియన్ 5వ మహాసభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీ గౌడ్, గోర శ్యాంసుందర్‌గౌడ్, విశ్వనాధుల పుష్పగిరి, మారోజు రామన్న, బొంగు వెంకటేష్‌గౌడ్, యూనియన్ సభ్యులు బుర్ర చంద్రయ్య, ఎండీ యూనస్, నర్సింగరావు, అజయ్‌రెడ్డి, ఆశిక్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు అందజేస్తున్న చైర్మన్ విఠల్‌రెడ్డి

'పది'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో పది జీపీఏ సాధించి ప్రతిభ కనబరిచిన 12మంది విద్యార్థులకు మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ యాజమాన్యం ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున నగదు పురస్కారం అందజేసి, మెమెంటోలతో సత్కరించింది. శనివారం రాత్రి మీర్‌పేట్‌లో 'ఉత్కర్ష్' పేరుతో నిర్వహించిన స్కూల్ 12వ వార్షికోత్సవాన్ని నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ జి.విఠల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రజనీవిఠల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను సన్మానించారు. వార్షికోత్సవంలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సీఈవో శేషారావు, డీన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపాల్ డి.మహేశ్, ఇన్‌చార్జిలు, ఇతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ అనుబంధ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్సు పథకం ద్వారా నష్టపోతున్న ఆటోకార్మికులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఎల్బీనగర్ చౌరస్తా వద్ద గల కుంటి జంగయ్యకాలనీలోని ఆటోస్టాండ్ వద్ద ఆదివారం ఉదర రమేష్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా ఆటో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు కడారి రాములు మాట్లాడుతూ 50ఏళ్లు నిండిన డ్రైవర్లందరికీ రూ.7వేల పెన్షన్ ఇవ్వాలని, అర్హులైన డ్రైవర్లకు కొత్త వాహనాల కొనుగోలుకు బ్యాంకు రుణాలు పొందేలా చూడాలని, 2019 మోటార్ వెహికిల్ వాహనచట్టాన్ని సవరించాలని, రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఆటో డ్రైవర్లు రమావత్ రాములు, ఎన్.రవి, కొర్ర కుమార్, రమేష్, జంగయ్య, పి.శివ, కొర్ర శివ, ఎం.రఘు, రమావత్ జగన్, భాస్కర్, కురుశెట్టి గణేష్, సైదులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి దేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు జగద్గురు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్యాశీస్సులతో జరుగు వార్షిక బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు 18 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు, మహిళలచే కుంకుమార్చన, మహానక్షత్ర హారతులు ఇవ్వనున్నారు. చివరి రోజైన ఫిబ్రవరి 19న సాయంత్రం ఆలయ పరిసర కాలనీలలో పల్లకీసేవ నిర్వహించనున్నారు. కుర్తాళ సిద్ధేశ్వరీ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్‌శర్మ నిర్వహణలో జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ కోరారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

కులగణన సర్వేపై అవగాహన

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేపై మూసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్‌కాలనీ పార్కులో తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొనని కుటుంబీకులు, సర్వేలో నమోదు చేసుకోని వారు మరోసారి నమోదు చేసుకోవడానికి కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా రాపోలు జయప్రకాష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు జరగనున్న మరోసారి కులగణన సర్వేలో ఇదివరకు నమోదు చేసుకోని వారికి అవకాశం కల్పించిందని ఆయన వివరించారు. ఇంటికి వచ్చిన కులగణన సర్వే అధికారులు, సిబ్బందికి కుటుంబీకులు సహకరించి కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ దొంతోజు కృష్ణమాచారి పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్, బీసీ సంక్షేమ శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృష్ణమాచారి

ఫోన్‌చేస్తే ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారు : డీసీ జయంత్

కులగణనలో ఇప్పటి వరకు నమోదు కాని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111ను ఏర్పాటు చేసినట్లు మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తుందన్నారు. ఇప్పటి వరకు కులగణనలో నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి వారి మొబైల్ నంబరు, చిరునామాతోపాటు పోస్టల్ కోడ్ నంబర్‌ను తెలియజేయాలని ఆయన వివరించారు. ఈ కాల్ సెంటర్ జీహెచ్‌ఎంసీ పరిధితోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కాల్స్ కూడా స్వీకరిస్తారన్నారు. ఇతర జిల్లాలకు చెందిన వివరాలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఫార్వర్డ్ చేస్తామన్నారు. కాల్ చేసిన వ్యక్తి పూర్తి వివరాలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వార్డు ఆఫీసుల ద్వారా పేరు, వీధి, గ్రామం, మొబైల్ నంబర్, ఇంటి నంబరు, పట్టణాల్లో అయితే సర్కిల్ లేదా వార్డు నంబర్ వివరించినట్లయితే ఆయా చిరునామా ఆధారంగా ఎన్యుమరేటర్ వారి ఇంటికి వెళ్లి కులగణన వివరాలు సేకరిస్తారన్నారు. మొబైల్ నంబర్‌తో సెర్చ్ చేసి సంబంధిత వ్యక్తి పాత డేటా బేస్‌లో నమోదు అయ్యారా లేదా వివరాలు ఉన్నాయా అని పరిశీలించనున్నారు. వివరాలు లేనిపక్షంలో సంబంధిత వ్యక్తి పేరు, చిరునామా వివరాలను సేకరిస్తారన్నారు. జీహెచ్‌ఎంసీ, నాన్ జీహెచ్‌ఎంసీ పరిధి వివరాలను ముందుగా అడుగుతారు. జీహెచ్‌ఎంసీ పరిధికాని కుటుంబీకులైతే మున్సిపాలిటీ, వార్డు నంబరు, చిరునామా, గ్రామం, లేదా మండలం అడిగి నమోదు చేస్తారు.



తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కులగణన సర్వే కేంద్రం

ఆయా వివరాలను తెలియజేసినట్లయితే ఎన్యుమరేటర్ ఇంటి వద్దకు వచ్చి కులగణన సర్వే వివరాలను సేకరిస్తారని డీసీ వివరించారు.

రాగన్నగూడలో కులగణన సర్వే కేంద్రం ప్రారంభం

హయత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశం మేరకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ వార్డు కార్యాలయంలో కులగణన వివరాలను నమోదు చేయించుకునేందుకు ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం కమిషనర్ అమరేందర్‌రెడ్డి నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. నమోదు కేంద్రం 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం తొలి విడుత జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, గణన సర్వేలో వివరాలు నమోదు చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 040-21111111తో పాటు తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది రాజు, శివకుమార్, జాఫర్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ

- **దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్, ప్రముఖులు**

హయత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదిత్య పరాశ్రీస్వామి ఆధ్వర్యంలో జనమంచి శేఖర్‌శాస్త్రీ పర్యవేక్షణలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. రెండు రోజులుగా ఆలయం వద్ద హోమాలు, అగ్నిప్రతిష్ఠ, యంత్ర జపములు జరుగుతున్నవి. ఆదివారం ఉదయం 5.24గంటలకు గర్తన్యాసం, 8.32గంటలకు యంత్ర, విగ్రహప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బోనాల ఉత్సవాలను నిర్వహించి బోనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నక్క రవీందర్‌గౌడ్, పారంద రమేష్‌తో పాటు పలువురు నాయకులు రేణుకా ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పారంద స్వామి, ఎర్ర రవీందర్, ముత్యాల శ్రీకాంత్, శ్రీధర్‌ముదిరాజ్, జంగం ముదిరాజ్, నాగభూషణంయాదవ్ పాల్గొన్నారు.


హయత్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

శ్మశానవాటికలను అభివృద్ధి పరచండి

- **ఎంపీ ఈటలకు రాక్‌టౌన్‌కాలనీవాసుల విన్నపం**

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసి అనధికారికంగా నిర్వహిస్తున్న శ్మశానవాటికలను వేరే చోటుకు తరలించి వాటిని పార్కులుగా అభివృద్ధి పరచాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, సభ్యులు కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌ను శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన వారంతా సమస్యకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు ఎంపీ ఈటల సానుకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కారమయ్యేలా తప్పకుండా సహకరిస్తానని పేర్కొన్నట్లు రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, సభ్యులు మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సామూహిక గణపతిహోమం నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

భక్తిశ్రద్ధలతో గణపతిహోమం

చంపాపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని వినాయకస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక గణపతిహోమంను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.లావణ్య, వేద పండితులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఆ మొక్కలేవో పార్కు స్థలాల్లో నాటండి'

- **బీఆర్‌ఎస్ నేతలకు బీజేపీ నేత సూచన**

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఒక్కొక్కరు మూడు మొక్కలు చొప్పున నాటాలని ఎమ్మెల్యే సబితారెడ్డి బీఆర్‌ఎస్ నేతలకు సూచించినందున.. ఆ మొక్కలేవో పార్కు(ఖాళీ) స్థలాల్లో నాటి అవి కబ్జా కాకుండా కాపాడాలని బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. ఆదివారం బడంగ్‌పేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలామటుకు పార్కు స్థలాలు సబితమ్మ అనుచరులే కబ్జాచేశారని, వాటిలో మొక్కలు నాటించి కబ్జా చెర నుంచి వాటికి విముక్తి కల్పించాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో మంచిదని, కానీ సదరు మొక్కలు ప్రజోపయోగార్థం ఎదగాలంటే పార్కు స్థలాల్లో నాటడమే ఉత్తమమని ఆయన పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా గంధం ఉత్సవం

- **బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాతారెడ్డి**

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడీషరీఫ్‌లో ప్రతియేటా నిర్వహించే హజ్రత్ సయ్యద్ బాబా షర్ఫుద్దీన్ దర్గా మహోత్సవంలో భాగంగా బాలాపూర్‌లో నిర్వహించే గంధం ఊరేగింపు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. శనివారం రాత్రి బాలాపూర్‌లో నిర్వహించిన గంధం ఊరేగింపును దర్గా ప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, బాలాపూర్ పెద్దలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ గతంలో పాత నగరంతో కలిసి ఉన్న బాలాపూర్‌లో దర్గా ఉత్సవం సందర్భంగా గంధం ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇది బాలాపూర్ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. పహాడీషరీఫ్ దర్గా మహోత్సవాన్ని శాంతియుతంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బాలాపూర్ శివాలయం కమిటీ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, తూళ్ల సునీతాగౌడ్, అనురాధ, నరహరిగౌడ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.


బాలాపూర్‌లో గంధం ఊరేగింపు ఉత్సవంలో పాల్గొన్న పారిజాతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసింది.. గాంధీ కుటుంబం

- **టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్**

చంపాపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భారతదేశం కోసం ప్రాణ త్యాగాలు చేసింది.. కాంగ్రెస్ కుటుంబం అని, బీసీల కోసం ప్రధాని మోదీ ఏమి చేయలేదని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని కాంగ్రెస్ సేవాదళ్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మోదీ కులం గురించి తప్పుగా ఏమీ మాట్లాడలేదన్నారు. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను బీజేపీ నేతలు మర్చిపోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని జితేందర్ ఆరోపించారు. మోదీ లీగల్‌గా బీసీగా మారిండని అన్నారే తప్ప తప్పుగా సీఎం ఏమి మాట్లాడలేదన్నారు. కులగణన దేశ చరిత్రలో నిలిచిపోయే అంశమని అది బీజేపీ నేతలకు మింగుడు పడడం లేదన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఏదో మాట్లాడుతున్నారని, బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రమంత్రి అన్న సంగతి బండి సంజయ్ మరిచిపోయి మాట్లాడుతున్నారని, భారతదేశం సెక్యులర్ దేశం అని గుర్తుంచుకోవాలని అన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే జనగణనతో పాటు కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కులగణన సర్వే పూర్తి అయ్యాక ప్రభుత్వం చట్టం చేస్తుందని, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూల్ చట్ట సవరణ చేసి దేశంలోని బీసీలకు మేలు చేయాలని కోరారు. సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శులు దయాకర్‌రావు, సురేందర్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిద్దెల జితేందర్


వైద్య పరీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు రామాచారి

వైద్య పరీక్షా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ఉచిత వైద్య పరీక్షా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రామాచారి అన్నారు. ఆదివారం శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి, మేడి ఐ కేర్ ఆస్పత్రి, సిగ్నేచర్ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య బృందం దాదాపు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమలాకర్, కోశాధికారి యాదయ్యయాదవ్, రీజినల్ కౌన్సిలర్ చక్రపాణి, ఎన్నికైన డిస్ట్రిక్ గవర్నర్ బి.గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో వైద్యులు, స్థానికులు

ఉచిత వైద్య శిబిరం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ కమలానగర్‌కాలనీలో నాగోల్‌లోని సుప్రజా ఆస్పత్రి సౌజన్యంతో కమలానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆస్పత్రి వైద్యులు నీలిమ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో జీఆర్‌బీఎస్ బీపీ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేంద్ర, ఆస్పత్రి మార్కెటింగ్ డీజీఎం ఏవీ రావు, వైద్య సిబ్బంది కార్తికేయన్, సౌందర్య, మనీష, దివ్య, స్వాతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్ట్

- **అరకు నుంచి తెచ్చి నగరంలో విక్రయం**
- **6 కిలోల గంజాయి స్వాధీనం**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అధిక సంపాదన కోసం గంజాయి విక్రయాలు చేస్తున్న ఇద్దరు యువకులను, వారి వద్ద కొనుగోలు చేస్తున్న ఇద్దరు కస్టమర్లను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. సూర్యాపేటకు చెందిన తంగెళ్లపల్లి అఖిల్‌కుమార్(23) మీర్‌పేట ప్రాంతంలో ఉంటున్నాడు. ఇతడు గంజాయికి, క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. మంగళ్‌హాట్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి, తాను సేవించడంతోపాటు నగరంలో పలు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. మంగళ్‌హాట్ కన్నా అరకు ప్రాంతంలో గంజాయి తక్కువ ధరకు వస్తుందని గ్రహించి అరకులో ఉండే గంజాయి వ్యాపారి జిన్నును సంప్రదించాడు. అరకు నుంచి గంజాయి తెచ్చేందుకు, నగరంలో విక్రయించేందుకు అఖిల్‌కు సిద్దిపేటకు చెందిన మాడుగుల రాకేష్ అలియాస్ రాకీ(24) సహకరించేవాడు. ఇద్దరు కలిసి అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేయడం, విక్రయించడం చేసేవారు. వీరిద్దరూ కలిసి అరకు వెళ్లి 6కిలోల గంజాయి కొని నగరానికి తెచ్చారు. సికింద్రాబాద్ అల్ఫా హోటల్ వద్ద ఉండగా వీరి దందాపై పక్కా సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వీరి నుంచి 6కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న మీర్‌పేటకు చెందిన ఎన్ స్వరూప్, సాయినాథ్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు.



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న గంజాయి, మొబైల్ ఫోన్లు

ఇద్దరి పిల్లలతో ఇల్లాలి అదృశ్యం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తన ఇద్దరు పిల్లలతో కలిసి ఓ ఇల్లాలు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదంటూ ఆమె భర్త మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మలక్‌పేట ఎస్‌ఐ సీహెచ్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గి గ్రామ నివాసి గిరిమోని కృష్ణవేణి(34)తో కలిసి ఆమె భర్త గిరిమోని మల్లేష్ ఆరు మాసాలుగా శ్రీపురంకాలనీలో నివాసముంటున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కూలీ పనికి వెళ్లిన మల్లేష్ ఈనెల 7వ తేదీన సాయంత్రం 6గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య కృష్ణవేణి, తన ఇద్దరు పిల్లలైన గిరిమోని గణేష్(13), గిరిమోని ప్రణతి(8) కనిపించకపోవడంతో బంధువుల ఇంట్లో వెతికాడు. భార్య కృష్ణవేణి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో భార్య ఇద్దరు పిల్లలు కనిపించడం లేదంటూ భర్త మల్లేష్ మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈమేరకు మలక్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గిరిమోని కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు గణేష్, ప్రణతి

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 10మంది వాహనదారులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్‌లో గల రాజీవ్‌చౌక్ చౌరస్తాలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10మంది వాహనదారులు పట్టుబడ్డారు. సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ వి.చంద్రకుమార్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. శిక్షణలో ఉన్న ప్రొబెషనరీ ఐపీఎస్ ఆఫీసర్లు డ్రంకెన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మద్యం సేవించి ఉన్న వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించే కేసులను ఏవిధంగా నమోదు చేస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టుబడిన 10మంది మద్యం ప్రియుల ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఏసీపీ చంద్రకుమార్, మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు